ఇంటింటా సంతోషం


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న పిరియా విజయ

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- ధర్మపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఇచ్ఛాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఇంటింటా సంతోషం వ్యక్తమవుతోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పరియా విజయ అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని 194వ రోజైన ధర్మపురంలో బుధవారం నిర్వహించారు. కష్టాలు మా గడపదాటి లోపలకు రాకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ఆదుకుంటుందని గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదలను ఆర్థికంగా ఉన్నత స్థితిలో నిలపాలన్నది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమన్నారు. నవరత్నాలు పేరిట ప్రతి పేదవారింటికి సంక్షేమ పథకాలు నిష్పక్షపాతంగా చేరువవుతున్నాయన్నారు. ప్రతిపక్షాల విమర్శలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. తమ కాలనీకు సీసీ రోడ్డును మంజూరు చేయాలంటూ స్థానిక ఎస్సీ కాలనీ వాసులు కోరగా.. సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు మంజూరుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం, కంచిలి ఎంపీపీలు బోర పుష్ప, పైలా దేవదాసురెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ పిట్ట రుక్మిణీ, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, లొద్దపుట్టి ఎంపీటీసీ సభ్యురాలు పిట్ట హేమలత, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, కేధారిపురం సర్పంచ్ నీలాపు సారథిరెడ్డి, రాంపత్ని చిట్టిబాబు, పిట్ట విశ్వనాథం, పిట్ట బాలయ్య పాల్గొన్నారు.

నేడు నర్సింగపురంలో..

మందస: నర్సింగపురం పంచాయతీలో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ డొక్కరి దానయ్య, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు గురువారం తెలిపారు. మంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

డీఎల్పీవోకి సన్మానం


వెంకటరమణను సన్మానిస్తున్న దృశ్యం

మందస: మందస మండల పంచాయతీరాజ్ విస్తరణాధికారిగా పని చేసిన ఇప్పిలి వెంకరమణకు డీఎల్పీవోగా పదోన్నతి లభించింది. ఈయన టెక్కలి డీఎల్‌పీవోగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆయనను మండల నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు మాట్లాడుతూ.. వెంకటరమణ మంచి అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. మందస మండలం అభివృద్ధిలో తనదైన పాత్ర పోషించారన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజమని, పదోన్నతి పొంది.. వెళ్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా డీఎల్పీవో వెంకటరమణ, శ్రీదేవి దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం సన్మాన గ్రహీత ఐవీ రమణ మాట్లాడుతూ ఈ ప్రాంతీయులు చూపిన ఆదరాభిమానాలు మరచిపోలేనన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొర్నాని ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు పులారి తవిటయ్య, మందస ఈవో ఏపీ సత్యన్నారాయణ, ఏపీవో బి.వి.హరికృష్ణ, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వలంటీర్లకు పురస్కారాల ప్రదానానికి చర్యలు

మందస: మండలంలోని ఎంపిక కాబడిన గ్రామ వలంటీర్లను సేవా పురస్కారాలతో సన్మానించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు చెప్పారు. సవర నాగేశ్వరరావు (కొండలోగాం), నెమలపురి రవి (రాంపురం)లకు సేవా వజ్రపురస్కారం, శిగలపల్లి పుష్పలత (ఉమాగిరి), కొల్లి చామంతి (జిల్లుండ), తమిరియా సుజాత (బెల్లుపటియా), దున్న ఖగేశ్వరరావు (సువర్ణాపురం), బొడ్డు స్వాతి (బహడపల్లి)లకు సేవారత్న పురస్కారాలు అందజేయనున్నామన్నారు. మిగిలిన 409 వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలతో సన్మానించనున్నట్టు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి: టెక్కలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు సంబంధించి ఓపెన్ కేటగిరీలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో పి.శోభారాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సంతబొమ్మాళి మండలం కూర్మనాథపురం అంగన్‌వాడీ వర్కర్, భావనపాడు-1, మరువాడ-1, మేఘవరం-2, శివరాంపురం కేంద్రాల్లో హెల్పర్ పోస్టులకు, సూరాడవానిపేట, ఆర్.సున్నాపల్లి మినీ అంగన్‌వాడీ వర్కర్, టెక్కలి మండలం వీఆర్‌కే.పురం మినీ అంగన్‌వాడీ వర్కర్, తేలినీలాపురం హెల్పర్, కొండభీంపురం హెల్పర్ తదితర పోస్టులకు ఓపెన్ కేటగిరీలో దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

మందస: మందస ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో నాలుగు అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు రోస్టర్‌లో ఇచ్చిన నోటిఫికేషన్‌ను మార్పు చేసినట్టు సీడీపీఓ కె.వసుంధరాదేవి చెప్పారు. సోంపేట మండలంలోని రామయ్యపట్నం, మందస మండలంలోని లింబుగాం, పిల్లిబుడారిసింగి, వాసుదేవపురం కేంద్రాలకు సంబంధించి ఏడబ్ల్యూహెచ్ పోస్టులకు రోస్టర్ పాయింట్ మార్చినప్పటికీ, అభ్యర్థినులు లభ్యత కాలేదన్నారు. ప్రభుత్వం ఆమోదం రోస్టర్ పాయింట్లు ఓపెన్ కేటగిరీకి మార్చి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నామన్నారు. ఓపెన్ కేటగిరీలో అన్ని కులాలవారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఇచ్ఛాపురం: అర్బన్ ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు ఓపెన్ కేటగిరీలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంబంధిత అధికారిణి పి.నాగరాణి తెలిపారు. ఏఎస్‌పేట, రథంవీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుతోపాటు చిన్నమేదరవీధి, కాశీవిశ్వేశ్వర వీధిలోని కేంద్రాల్లో సహాయకురాలి పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఖాళీగా ఉన్న కార్యకర్తలు, సహాయకుల పోస్టులను ఓపెన్ కేటగిరీలో భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నామని సీడీపీవో పురాణం నాగమణి చెప్పారు. తలతంపర-1, మినీ అంగన్‌వాడీ కార్యకర్తకు సంబంధించి ఉప్పరిపేట, సహాయకులకు సంబంధించి తిప్పనపుట్టుగ-1, కవిటి-3, కె.కపాసుకుద్ది, బైరెడ్డపుట్టుగ, సావసానపుట్టుగ, రాపాకపుట్టుగ, ఘునాథపురం, దొలామిపుట్టుగ, ఆర్.గెద్దలపాడు, ప్రధానపుట్టుగ, మరంకంచిలి, కర్తలి, బసవపుట్టుగ, బిన్నలకొత్తూరు, సామంతపుట్టుగ, సవరగోవిందపురం, అరకపద్ర-1లో ఖాళీలను భర్తీ చేస్తామన్నారు.

సరిహద్దు గ్రామాల్లో ఉపాధ్యాయుల ప్రచారం


మాకన్నపురంలో ప్రచారం చేస్తున్న పీఎస్‌పురం పాఠశాల ఉపాధ్యాయులు

మందస: తమ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరుతూ పొత్తంగి-సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గ్రామాల్లోకి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా సరిహద్దులో ఉన్న సోంపేట మండలం మాకన్నపురం పంచాయతీలో గురువారం పర్యటించి సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావును కలిశారు. బడిఈడు బాలబాలికలను పీఎస్‌పురం జెడ్పీహెచ్ఎస్‌లో చేర్పించాలని తల్లిదండ్రులను అభ్యర్థించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చదువుల విశ్వనాథం, ఉపాధ్యాయులు నగిరి కరుణాకర్, శిష్టు సోమనాథ్, సింహచలపతి, సుకాంత్‌కుమార్, ఎస్.ఢిల్లీరావు, ఎస్.కామేశ్వరరావు ప్రచారంలో పాల్గొన్నారు.

స్పందనపై ప్రత్యేక దృష్టి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

సోంపేట: స్పందన కార్యక్రమంపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆర్డీవో తమరాల సీతా రామమూర్తి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'జగనన్నకు చెబుదాం' ద్వారా వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు తప్పక పాల్గొనాలని సూచించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి ఫణిభూషణం రెడ్డి, ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, తహసీల్దార్ పి.కూర్మారావు, విద్యాశాఖాధికారి ఎస్.జొరాడు, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, పీఆర్ ఏఈ రమేష్, ఏపీవో ప్రమీల పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం


డ్రైనేజీలో జేసీబీతో పూడికను తొలగిస్తున్న దృశ్యం

కంచిలి: కంచిలిలో రైల్వేస్టేషన్ కూడలిలోని బజారు సెంటర్ మెయిన్‌రోడ్డు పక్కన డ్రైనేజీలో పూడికతీత పనులను పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం నుంచి ప్రారంభించారు. ఈ ప్రాంతంలో ఉన్నటువంటి వివిధ వ్యాపార సంస్థలు, ఇళ్ల వినియోగదారులు నుంచి జమవుతున్న చెత్త నిల్వలు, ఇతర వ్యర్థాలు ఎటూ వెళ్లకుండా ఒకే చోట ఉండిపోవడంతో డ్రైనేజీ నుంచి పెద్ద ఎత్తున దుర్వాసన వెలువడుతోంది. ముఖ్యంగా ఇక్కడ మిఠాయి తయారీ కేంద్రాల నుంచి వెలువడిన వ్యర్థాలను సైతం డ్రైనేజీలోకే విడిచిపెట్టడంతో తరచూ ఈ సమస్య ఎదురవుతోందని పలువురు వ్యాపార సంస్థల యజమానులు, ఇళ్ల యజమానులు ఆరోపిస్తున్నారు. సంబంధిత మిఠాయి తయారీ కేంద్రం జనావాసాల మధ్య ఉండకూడదని నిబంధన ఉన్నప్పటికీ ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టకుండా ఇలా డ్రైనేజీని మాత్రమే శుభ్రపరిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం కాదంటున్నారు. ఇప్పటికైనా మిఠాయి దుకాణానికి సంబంధించిన తయారీ కేంద్రాన్ని జనావాసాలు లేని ప్రాంతానికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్య తరచూ తలెత్తుతోందని, ముందుగా కాలువలను శుభ్రం చేయిస్తున్నామన్నారు.

వర్షానికి దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు


వజ్రపుకొత్తూరు రూరల్: కొత్తగా విద్యుత్ తీగలను వేస్తున్న సిబ్బంది

టెక్కలి: అకాల వర్షంతో విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లింది. బుధవారం రాత్రి అకాలంగా కురిసిన వర్షాలు, పిడుగులతో టెక్కలి మండలంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. అలాగే కొన్నిచోట్ల విద్యుత్ తీగలపై చెట్లు విరిగిపడ్డాయి. సంతబొమ్మాళి మండలంలో రెండు ట్రాన్స్‌పార్మర్లు, 30 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కోటబొమ్మాళి మండలండలో కూడా రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. అలాగే 15 స్తంభాలు ఒరిగిపోవడంతో పాటు ఎక్కడికక్కడ తీగలు తెగిపోయాయి. విద్యుత్ శాఖ సిబ్బంది శుక్రవారం ఉదయం నుంచే పునరుద్ధరణ పనులు చేపట్టారు.

భయం..భయం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో వాతావరణంలో పెనుమార్పులు సంభవించాయి. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు, ఈదురుగాలులు వీయడంతో ప్రజలు భయందోళన చెందారు. ఈదురుగాలుల ప్రభావంతో ఉద్యాన పంటలకు కొంత నష్టం వాటిల్లింది. నగరంపల్లి వద్ద విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ సిబ్బంది స్పందించి గురువారం ఉదయం సరికి సంఘటన స్థలానికి చేరుకొని మరమ్మతులు చేశారు.

విత్తనాల కోసం పేర్లు నమోదు

కోటబొమ్మాళి: మండలంలోని 27 సచివాలయాల పరిధిలోని రైతులు ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలను రాయితీపై పొందడానికి ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని ఏవో గోవిందరావు గురువారం తెలిపారు. ఇప్పటికే మండలంలోని 13 వేల మందికి రైతు భరోసా వర్తిస్తోందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కంచిలి: కంచిలి, మఠం సరియాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరాకు అంతరాయం కలగనుందని స్థానిక విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్, స్థానిక ఏఈ ఎస్.గురవయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సోంపేట ఫీడర్ నుంచి వచ్చే హెచ్‌టీ లైన్ నిర్వహణతోపాటు కంచిలి, మఠం సరియాపల్లి 33 (11) కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున సరఫరాను నిలిపి వేస్తున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జగనన్న కాలనీలో అక్రమ నిర్మాణదారుల గుర్తింపు

టెక్కలి: శ్యామసుందరాపురం వద్ద జగతిమెట్ట సమీపంలో వైఎస్సార్ జగనన్న కాలనీలో ఎటువంటి పట్టాలు లేకుండా అక్రమంగా ఇళ్ల నిర్మాణాలను చేస్తున్న వారిని గుర్తించినట్లు టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాలనీలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదుల మేరకు రెవెన్యూ అధికారులతో దర్యాప్తు చేయించామన్నారు. ఇందులో 12 మంది వరకు ఎటువంటి పట్టాలు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేసినట్లు గుర్తించామని వెల్లడించారు. దీంతో వారికి నోటీసులు అందజేసి ఆయా నిర్మాణాలను నిలుపుదల చేయడంతో పాటు స్థలాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి


మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం, మంచినీరు, వీధి దీపాల సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, ఈవోపీఆర్డీ టి.వాసుదేవు పాల్గొన్నారు.

సైన్స్ పట్ల అవగాహన ఉండాలి


కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

టెక్కలి: విద్యార్థులకు సైన్స్‌లో అంతర్గత అంశాలపై అవగాహన కలిగి ఉండాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కె.కామేశ్వరరావు అన్నారు. టెక్కలి ఆదిఆంధ్రావీధిలో గల పాఠశాలలో గురువారం నుంచి వేసవి వినోదం కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు వికాసానికి దోహదపడే వినోదం అవసరమన్నారు. శాస్త్రీయ ఆలోచనలతో నేర్చుకున్న అంశాలు నిత్య జీవితంలో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎం.పద్మనాభరావు, పి.ధర్మారావు, డి.పాపారావు, టి.వైకుంఠరావు, కె.దాలయ్య, యు.దుర్గాప్రసాద్ ఉన్నారు.

విద్యార్థిని చదువుకు ఆర్థికసాయం


రామయ్యకు సాయాన్ని అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

కవిటి: హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న చింతామణి అమ్మవారి ట్రస్టు అందిస్తున్న కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ సేవలు ప్రశంసనీయమైనవని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. గొండ్యాలపుట్టుగకు చెందిన పేదవిద్యార్థిని బొర్ర ఝాన్సీ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. దీంతో ఆమె చదువు కొనసాగించేందుకు వీలుగా ట్రస్టు సాయం చేసేందుకు ముందుకువచ్చింది. 50 వేల రూపాయలను ట్రస్టు అధినేతలు మణికుమార్, ఇందిరాదేవిలు విద్యార్థిని తండ్రి రామయ్యకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు బి.రమణమూర్తి, పి.చంద్రశేఖర్, ప్రముఖ వ్యాపారవేత్త పొల్లాయి ఉమామహేశ్వరరావు, త్రివిక్రమరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జన్ని లోకనాథం పాల్గొన్నారు.

యూవీవీ గ్రంథాలయాన్ని బీడీసీగా నమోదు చేయాలని వినతి


వినతి పత్రం అందజేస్తున్న యూవీవీ ప్రతినిధులు

పలాస: నీలావతి గ్రామంలోని ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నిర్మించిన ప్రజాగ్రంథాలయాన్ని బుక్ డిపో సెంటర్(బీడీసీ)గా నమోదు చేయాలని యూవీవీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రతినిధులను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యు.వి.వి అధ్యక్షుడు ఇ.జోగారావు, పూర్వ గ్రంథాలయ కన్వీనరు కుత్తుం ప్రకాశరావు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, అకాడమిక్ కన్వీనరు పి.బాలరాజు, తంగుడు ఖగేశ్వరరావు ఉన్నారు.

మృతుల కుటుంబానికి పరామర్శ


సాయం అందజేస్తున్న నాయకులు

సోంపేట: బారువ గ్రామానికి చెందిన తండ్రీ కుమారులు దున్న చిరంజీవి, ప్రణయ్ మహేంద్ర తనయ నదిలో మునిగి ఇటీవల మృతి చెందారు. దీంతో వారి కుటుంబ సభ్యులను సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి తదితరులు గురువారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. ఐదు వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తడక జోగారవు, వైస్ ఎంపీపీ గురాల శ్రీను పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి రైతాంగ సమస్యలు


మంత్రి అప్పలరాజుకు సమస్యలు వివరిస్తున్న కామేశ్వరరావు

మందస: రైతుల సమస్యలను మహేంద్ర రైతు సంఘం అధ్యక్షుడు బెస్త కామేశ్వరరావు మంత్రి సీదిరి అప్పలరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మంత్రిని గురువారం కలిశారు. రాజుల హయాం నుంచి మందస ప్రాంతంలో సాగునీటి వనరులున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో సద్వినియోగం కాలేదన్నారు. గోపాలసాగరం, సంకుజోడు, జంతిబంద, జెన్నాచెరువులను మినీ రిజర్వాయర్లుగా మార్చితే రైతులకు మేలు జరుగుతుందన్నారు. దామోదరసాగరం రిజర్వాయర్ కుడికాలువ పనులు నేటికీ పూర్తి కాలేదని మంత్రికి వివరించారు. బెల్లుపటియా వద్ద రాజుల కాలం నాటి వంతెన (దోనె) కుప్పకూలడంతో ఆయకట్టుకు సాగునీరు అందడంలేదన్నారు. చికిడిగాం జంపరగైరి పూర్తిగా పాడయ్యిందని, కళింగదళ్, డబారిసింగి కాలువలకు మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలపై మంత్రి సీదిరి సానుకూలంగా స్పందించినట్టు కామేశ్వరరావు తెలిపారు.

టెన్త్ తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు


ఈదుపురం పాఠశాలలో ప్రత్యేక తరగతులు జరుగుతున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: పదో తరగతి పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను అధికారులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతుల ద్వారా వారంతా ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామని ఎంఈవో కురమాన అప్పారావు చెప్పారు. మండలం, మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 359 మంది విద్యార్థులు పరీక్షల్లో తప్పారని, రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులను నిర్వహించి సంబంధిత ఉపాధ్యాయులచే తరగతులు బోధిస్తున్నామన్నారు.

'వైఎస్సార్ యంత్రసేవ'తో రైతులకు మేలు


యంత్రాలను అందజేస్తున్న చైర్మన్ గిరిబాబు, నాయకులు

- మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

కాశీబుగ్గ: వైఎస్సార్ యంత్రసేవా పథకంతో నిజమైన రైతులకు ఎంతో మేలు చేకూరుతోందని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ బళ్ల గిరిబాబు అన్నారు. 22వవార్డుకు చెందిన ఐదుగురు కూరగాయలు పండించే పొందర రైతులకు సబ్సిడీపై యంత్రాలను గురువారం అందించారు. ఒక్కో యూనిట్ విలువ రూ.లక్ష కాగా రూ. 40 వేలు సబ్సిడీ వర్తిస్తోందన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ ఇన్‌చార్జి లోకనాథ్ బెహరా, పట్టణ అధ్యక్షుడు సనపల సింహచలం, డబ్బీరు నాగు పాల్గొన్నారు.

వేతనదారుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉపాధి హామీ పథకం వేతనదారుల సమస్యలు పరిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు బమ్మిడి ఆనందరావు, నెయ్యిల మోహన్ కోరారు. ఉపాధి పథకం పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ ఈ నెల 25న చేపడుతున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. పల్లిసారధిలో గురువారం వేతనదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

స్నేహితుల ఔదార్యం


శంకర్‌ని పరామర్శిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని 23 వార్డు బెల్లుపడ కాలనీకి చెందిన శంకర్ అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న అతని స్నేహితుడైన వార్డు కౌన్సిలర్ జి.దిలీప్, గవరయ్య, సంతోష్, అయ్యప్ప గురువారం కేజీహెచ్‌కి వెళ్లి పరామర్శించారు. ఖర్చుల నిమిత్తం రూ.10 వేల సాయాన్ని అందించారు.

మృతుని కుటుంబానికి సాయం


సాయాన్ని అందజేస్తున్న సంఘ సభ్యులు

వజ్రపుకొత్తూరు: అమలపాడు గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు బెజ్జి ధర్మారావు ఇటీవల కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. దీంతో గల్ఫ్ కార్మిక సేవా సంఘ సభ్యులు విరాళాలు సేకరించారు. సమకూరిన రూ. 25 వేలను అతని కుటుంబ సభ్యులకు గురువారం అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో అంగ నారాయణ, రామారావు, దున్న అనిల్, దున్న జానకీరావు, శ్యాం ఉన్నారు.

అందుబాటులో వైద్యం


పీహెచ్‌సీని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

టెక్కలి: గ్రామ స్థాయిలో ఇంటి వద్దకే వైద్యం అందజేయాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనకు అనుగుణంగా గ్రామీణ వాసులకు నిరంతరం వైద్యం అందజేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్, ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ అన్నారు. కె.కొత్తూరు పీహెచ్‌సీని కమిటీ సభ్యులంతా గురువారం పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. సర్పంచ్ మొర్రి శంకర్, సభ్యుడు హెచ్.వెంకటేశ్వరరావు, వైద్యులు ఎస్.గాయత్రి, డి.ఇంద్రజ ఉన్నారు.